9th HAPPY ANNIVERSARY

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 319 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శనివారం 27 జూలై 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda

# 90 రోజుల్లో మరో 30 వేల కొలువులు..

- ఏడాది తిరక్క ముందే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తం
- ఆందోళనలు చేయొద్దు.. మా వద్దకు వచ్చి మాట్లాడండి
- మీ అన్నగా సమస్య పరిష్కారానికి నేను సిద్ధంగా ఉన్నా
- రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యం
- బడ్జెట్ లో విద్య, వైద్యం, వ్యవసాయానిక పెద్దపీట వేశాం
- ఫైర్ మెన్ ల పాసింగ్ అవుట్ పరేడ్ లో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**రాబోయే 90 రోజుల్లో మరో 30 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తాము అధికారంలోకి రాగానే 30 వేల మందికి నియామక పత్రాలు అందించామని చెప్పారు. ఏడాది తిరక్క ముందే 60 వేల కొలువులు ఇస్తున్నామని చెప్పారు. ఇది ప్రజా ప్రభుత్వమని, నిరుద్యోగులు ఆందోళన చేయవద్దని తమ దగ్గరకు వచ్చి మాట్లాడాలని అన్నారు. మంత్రులు చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మీ అన్నగా నిరుద్యోగుల సమస్యలు వినేందుకు తాను కూడా సిద్ధంగా ఉన్నానని సీఎం చెప్పారు. ఇవాళ వట్టి నాగుల పల్లిలోని అగ్నిమాపకశాఖ శిక్షణా కేంద్రలో 483 మంది ఫైర్ మెన్ ల పాసింగ్ ఔట్ పరేడ్ కు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇదే కార్యక్రమంలో 157 మంది డ్రైవర్ ఆపరేటర్లకు సీఎం నియామక పత్రాలు అందజేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యంగా ఈ ప్రజాప్రభుత్వం ముందుకు వెళుతోందని చెప్పారు. ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలను, ఆస్తులను పరిరక్షిస్తున్న అగ్నిమాపక శాఖ తీరు అభినందనీయమన్నారు. పరేడ్ లో పాల్గొన్న ఫైర్ మెన్ లను చూస్తుంటే వాళ్ల తల్లిదండ్రులు ఎంతో ఆనందిస్తూ ఉంటారనిపిస్తోందన్నారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారిలో గ్రామీణ ప్రాంతాల వారే ఎక్కువన్నారు. ఎల్బీ స్టేడియం లో ఉద్యోగ పత్రాలు అందుకున్న

వివరాలు 2లో..

# సెప్టెంబర్ లో పంచాయతీ ఎన్నికలు?

- పాలకవర్గం టెన్యూర్ పూర్తై ఆరు నెలలు
- ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెలు
- ఆరు నెలలు దాటితే ఆగనున్న కేంద్రం ఫండ్స్
- వేగంగా ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- కులగణనకు ఐదు నెలలు పట్టే అవకాశం
- దీంతో ముందే ఎన్నికల నిర్వహణకు సర్కారు మొగ్గు
- సెక్రటేరియట్ లో రివ్యూ చేస్తున్న సీఎం

వివరాలు 2లో..

**హైదరాబాద్ పెన్ పవర్:** పల్లెల్లో ఎన్నికల నగారా మోగనుంది. సెప్టెంబర్ లేదా అక్టోబర్ లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ఏడాది జనవరి 31తో గ్రామపంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ముగిసింది. ఆగస్టు 1 నాటికి ఆరు నెలల పూర్తవుతుంది.




## ఈ సీజన్ లోనే రైతులకు పెద్ద వాగు నీళ్లు అందిస్తాం



- ఈ వానాకాలంలోనే పెద్దవాగు నీళ్లు
- రూ. 3. 50 కోట్లతో ఎస్టిమేట్స్
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

**హైదరాబాద్ పెన్ పవర్:** పెద్దవాగు ప్రాజెక్టు ఆయకట్ట మరమ్మత్తు పనులు సత్వరమే చేపట్టాల ని ఇరిగేషన్ అధికారులకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదేశించారు. ఈ వానాకాలం లోనే రైతులకు సరిపడ సాగునీరు అందే విధంగా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని మరమ్మత్తులు కోసం ఎస్టిమేట్స్ సిద్ధం చేయాలని సూచించారు. ప్రాజెక్టు తాత్కాలిక

వివరాలు 2లో..

## బీఆర్ఎస్ పిటిషన్‌పై వాదనలు వినిపించిన దానం నాగేందర్, కడియం శ్రీహరి!

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టులో పిటిషన్
- స్పీకర్ విషయంలో కోర్టులు జోక్యం చేసుకోరాదన్న న్యాయవాదులు
- తదుపరి విచారణను 30కి వాయిదా వేసిన హైకోర్టు



**హైదరాబాద్ పెన్ పవర్:**పార్టీ మారిన ఎమ్మెల్యేల పై చర్యలు తీసుకోవాలంటూ హైకోర్టులో బీఆర్ ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ 30వ తేదీకి వాయిదా పడింది. కడియం శ్రీహరి, దానం నాగేందర్ తదితర ఎమ్మెల్యేలు

వివరాలు 2లో..

## ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదు.. పాక్ ఉగ్రదాడుల్ని తిప్పి కొడతాం

### ప్రధాని మోదీ హెచ్చరికతో.. సరిహద్దులో అదనపు బలగాలను మోహరిస్తున్న పాకిస్థాన్

- 23వ పదాతిదళ డివిజన్‌లో అదనపు బలగాలతో భద్రత
- పీవోకేలోని సీనియర్ అధికారులతో మాట్లాడిన పాక్ ఆర్మీ చీఫ్
- కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఉగ్రవాదంపై దాయాది దేశానికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన మోదీ



**హైదరాబాద్ పెన్ పవర్:**ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఊపేక్షించేది లేదన్నారు ప్రధాని మోదీ.. పాకిస్తాన్ ఉగ్రదాడుల్ని తిప్పికొడతామని చెప్పారు. పాకిస్తాన్ ఎన్ని సార్లు దెబ్బతిన్నా దాని బుద్ధి మారలేదని..ఇప్పటికీ ఉగ్రవాదాన్నిపెంచి పోషిస్తుందన్నారు మోదీ. కార్గిల్ 25వ విజయ్ దివాస్ సందర్భంగా

వివరాలు 2లో..

## కేసీఆర్ స్థానంలో ఉండి ఉంటే రాజకీయాలకు గుడ్‌బై చెప్పేవాళ్లం

- ప్రజలు చీల్చి చెండాడితేనే ఒక్క ఎంపీ సీటూ గెలవలేదన్న మంత్రి
- బీజేపీలో బీఆర్ఎస్ విలీనమవుతుందని జోస్యం
- బీఆర్ఎస్ చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని ఆగ్రహం



**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో బడ్జెట్‌ను చీల్చి చెండాడు తామని కేసీఆర్ చెబుతున్నారని, అసలు ఆయనను ప్రజలు చీల్చి చెండాడితేనే ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటూ గెలవలేకపో యారన్నారు. ఏడు స్థానాల్లో

వివరాలు 2లో..

## ఆగస్ట్ 2 లోపు కాళేశ్వరం పంపింగ్ స్టార్ట్ చేయకుంటే...!



- రాజకీయాల కోసం ప్రజలు, రైతులను ఇబ్బందులు పెట్టవద్దన్న కేటీఆర్
- కేసీఆర్‌ను బద్నాం చేయాలనే కాళేశ్వరం ప్రాజెక్ట్ పంపులను ఆన్ చేయడం లేదని ఆరోపణ
- కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు కల్పతరువు అని వ్యాఖ్య

వివరాలు 2లో..

## కేసీఆర్ కక్కుర్తివల్లే కాళేశ్వరానికి లక్షా81వేల కోట్లు ఖర్చు



**హైదరాబాద్ పెన్ పవర్:**పదేళ్లలో కేసీఆర్ అండ్ పార్టీ కక్కుర్తి వల్లే కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్షా 81వేల కోట్లు ఖర్చు అవుతుందన్నారు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. అన్ని లక్షల కోట్లు ఖర్చుపెట్టినా నామ మాత్రపు ఆయకట్టు మాత్రమే వచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం పర్యాటక ప్రాంతంగా మార్చారు. కేసీఆర్ అవసరాలకోసమే ఈ ప్రాజెక్టును నిర్మించారన్నారు. వాళ్లే అప్పుడు, ఇప్పుడు పోతున్నారు.. వస్తున్నారని విమర్శించారు. గతేడాది పెద్ద శబ్ధం వచ్చి కాళేశ్వరం కూలిపోయిందన్నా దొంగనాటకాలాడారని అన్నారు. ప్రాజెక్టు పిల్లర్లు 6ఫీట్లు భూమిలోకి కూలిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నేషనల్

వివరాలు 2లో..

## కవితను వర్చువల్‌గా కోర్టులో హాజరుపరిచిన సీబీఐ అధికారులు

- సీబీఐ కోర్టు జడ్జి సెలవులో ఉండటంతో మరో కోర్టులో హాజరుపరిచిన అధికారులు
- విచారణను జడ్జి ఈ నెల 31వ తేదీకి వాయిదా
- కవిత జ్యుడీషియల్ కస్టడీ మరోసారి పొడిగింపు



వివరాలు 2లో..

## ఎవరు తీసిన గోతిలో వాళ్లే పడ్డరు

### తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై టీ బీజేపీ ట్వీట్

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ప్రభు త్వం ప్రవేశపె ట్టిన బడ్జెట్‌పై టీ బీజేపీ సెటైరికల్ ట్వీట్ చేసింది. 'ఎవరు తీసిన గోతి లో వాళ్లే పడినట్టు.. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల పేరు లేవని సోది వ్యాఖ్యలు చేసిన

వివరాలు 2లో..



# కేసీఆర్ తలాతోక లేకుండా మాట్లాడుతున్నారు

- దొంగే... దొంగ దొంగ అని అరిచినట్లుగా కేసీఆర్, హరీశ్ రావుల తీరు ఉందని విమర్శ
- పదేళ్లలో కేసీఆర్ తెచ్చిన అప్పులకు భారీ వడ్డీలు కడుతున్నామన్న జూపల్లి
- కేసీఆర్ పదేళ్ల కాలంలో ఎప్పుడూ వాస్తవిక బడ్జెట్‌ను పెట్టలేదని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:** రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించామని, కానీ మాజీ సీఎం కేసీఆర్ తలాతోక లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్ తన మాటలతో ప్రజలను మభ్యపెట్టాలని, ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. దొంగే... దొంగ దొంగ అని అరిచినట్లుగా కేసీఆర్, హరీశ్ రావుల పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు.పదేళ్లలో కేసీఆర్ తెచ్చిన అప్పులకు

వివరాలు 2లో..



# సంపాదకీయం

## ఆధ్యాత్మికం: మాట... మౌనానికి మునిమనవడు

మౌనమే అన్నింటికంటే సమర్థవంతమైనది, ఎన్నో ఏళ్లుగా దీనిని తెలుసుకోలేకపోయారో దాన్ని కేవలం ఒక్క మౌనం ద్వారానే తెలుసుకోగలం . కానీ, మౌనం నిర్మలంగా నిదానంగా, నిలకడగా ప్రవహించే జ్ఞాన స్రవంతి! మౌనంగా ఉండేవాళ్లను 'మునులు' అంటారు. ఇక, మనోవాక్కాయ కర్మలను స్వాధీనం చేసుకొని సత్యంగా, శాంతంగా, భూతహితంగా, మితంగా.. కరుణాన్వితంగా, ఆత్మభావంతో మాట్లాడే వాళ్లే మహామునులు.

మౌనమే మేలు మౌనంలోని ఆనందాన్ని అనుభవించాలంటే ముందు మాటని నియంత్రించాలి. ఇదొక అపూర్వ కళ, తపస్సు ఎక్కువగా మాట్లాడితే శక్తి తగ్గిపోతుంది. అతిగా మాట్లాడే వాళ్లకు విలువ కూడా తగ్గిపోతుంది. కాబట్టి వీలైనంత తక్కువ మాట్లాడాలి. మన మాటలు ఎదుటివాళ్లకి వినసొంపుగా,హితంగా ఉండాలి. అది చేతకాకపోతే మౌనంగా ఉండటమే మేలు' అని విదురనీతి వివరిస్తోంది. మాట వెండి అయితే, మౌనం బంగారం.. అనే సామెత కూడా ఉంది. కఠినంగా మాట్లాడి శక్తిని వృథా చేసుకోవడం కంటే మౌనంగా ధ్యానం చేయడం వల్ల ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితికి చేరుకోవచ్చు' అని అంటారు స్వామి వివేకానంద. బలహీనమైన మనసుకి కూడా బలం చేకూర్చగలిగేది మౌనం మాత్రమే.

**మౌనంలోనే మునులు**

మౌనంగా బోధించడం అనేది ఎన్నో ఏళ్లుగా మన దేశంలో కొనసాగుతున్న బోధన పద్ధతి. గురువు మౌనమే అన్నింటికన్నా గొప్ప ఉపదేశమని, గొప్ప అనుగ్రహం అని చెప్పాడు. గురువు మౌనం... శిష్యుల మనసును శుద్ధి చేస్తుంది. దక్షిణామూర్తి పరమశివుని జ్ఞానగురువు అవతారం, ఇతర గురువులు తమ శిష్యులకు మాటలతో బోధిస్తే దక్షిణామూర్తి' మాత్రం మౌనంగానే ఉండే శిష్యులు సందేహాలు తీరుస్తారు. ఇలాంటి గురువే రమణ మహర్షి .

ఆయన ఎప్పుడూ ఒక గుహలో కూర్చొని..సంపూర్ణ మౌనంలో మునిగేవారు. ఎలాంటి సందేహాలు వచ్చినా, వేదనతో వచ్చినా అతని దగ్గర కూర్చొని వెళ్లేవారు. ఆయన ఏంమాట్లాడేవారు. కాదు. కానీ, వాళ్లకు పరిష్కారం దొరికేది. ఆయన ఎప్పుడోగానీ మాట్లాడేవారు కాదు. మాటలతో చెప్పడం కంటే మౌనంగా చూపు, స్పర్శతోనే ఆయన ఎక్కువగా భోధ చేసేవారు. ఆ గురు శిష్యుల మధ్య మెంటల్ కాంటాక్ట్ ఉండేదన్నమాట 'మౌనమంటే పదాలు ప్రతి బంధాల్లేని నిశ్శబ్ద సంభాషణ అంటారు రమణ మహర్షి. ఆచి తూచి మాట్లాడటం చేతకానితనం కానేకాదు. తనపై తన ఆలోచనలపై తనకున్న పట్టును అది తెలియజేస్తుంది. 'చేజారిన కాలం, పెదవి దాటిన పలుకు' వెనక్కి రావు. అందుకే వాటిని ఎంత జాగ్రత్తగా ఉపయోగించుకోవాలో తెలిసి తీరాలి. ప్రతి రోజూ ఎన్నో రకాల ఆలోచనలు మనల్ని పట్టి పీడిస్తుంటాయి. వాటి ప్రభావం మన మాటలపై, చేతలపై పడుతుంది. అవి ఓ చక్రం తిరిగినట్టు తిరుగుతాయి. ఆ చక్రాన్ని ఆపే శక్తే మౌనం. ఏ సాధన అయినా మౌనం వల్లనే సాధ్యమవుతుంది. భగవంతుడి సాన్నిధ్యానికి చేర్చే అసలైన సాధనం మౌనమే. మనందరం మౌనంగానే ఎదుగుదాం...

## వాళ్లు కాళేశ్వరం విహారయాత్రకు వెళ్లారు:ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ లీడర్లంతా కాళేశ్వరం విహార యాత్రకు వెళ్లారని విమర్శించారు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. కుంగిన పిల్లర్లు చూసి కేటీఆర్ మాట్లాడాలన్నారు. కాళేశ్వరం అప్పులకు కేసీఆరే బాధ్యుడన్నారు. 30 వేల కోట్ల ఖర్చు అయ్యే ప్రాజెక్టుకు లక్షా 20 వేల కోట్లు ఖర్చు చేశారని ఫైరయ్యారు. వాస్తవాలను కప్పి పుచ్చుకోవడానికే విహారయాత్రల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని చెప్పారు. చేసిన తప్పులకు శిక్ష తప్పదన్నారు జీవన్ రెడ్డి. ఇప్పటికైనా కేసీఆర్ వాస్తవాలు గ్రహించి..తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఇవాళ కాళేశ్వరం పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భాగంగా కన్నెపల్లి పంప్ హౌస్, మేడిగడ్డ ప్రాజెక్ట్ సందర్శించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా.. ఆగస్టు 2 లోపు కాళేశ్వరం పంపు హౌసులు ఆన్ చేసి ప్రాజెక్టులకు నీళ్లివ్వాలని ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. లేదంటే కేసీఆర్ ఆధ్వర్యంలో 50 వేల మందితో తామే పంపు హౌసులు ఆన్ చేస్తామని హెచ్చరించారు.

# సెప్టెంబర్ లో పంచాయతీ ఎన్నికలు?

- మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఆరు నెలలు దాటితే కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామాలకు రావాల్సిన గ్రాంట్స్ ఆగిపోనున్నాయి. దీంతో ప్రభుత్వం ఆగమేఘాల మీద పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. దీని ప్రాధాన్యతా అంశంగా తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ సచివాలయంలో రివ్యూ నిర్వహించారు. అయితే కుల గణన నిర్వహించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి.

కులగణన చేయడానికి ఐదు నెలల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో కేంద్రం నుంచి వచ్చే నిధులు వెనక్కిపోతాయని భావిస్తున్న ముఖ్యమంత్రి ఆ లోపే ఎన్నికలు నిర్వహించేందుకు సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది.

గవర్నర్ ఆమోదిస్తే 234 కొత్త గ్రామాలు

రాష్ట్రంలో మొత్తం 12,769 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 234 నూతన గ్రామపంచాయతీల ఏర్పాటు గురించిన బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ సమయం వరకు నూతన 234 గ్రామ పంచాయతీల ఏర్పాటు కోసం ఉద్దేశించిన పెండింగ్ ఫైల్‌పై సంతకం పెడితే మొత్తం 13,003కు చేరుతుంది. పార్టీల గుర్తులపై కాకుండా ఈ ఎన్నికలు జరుగుతాయి. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల్లో వార్డు సభ్యులను, సర్పంచులను ఓటర్లు ప్రత్యక్షంగా ఎన్నుకోవాల్సి ఉంటుంది.

**క్యాబినెట్ లోనూ చర్చ**

పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఆగస్టు 1న నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. బీసీ కులగణనపై ఓ కమిటీ వేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో ఎన్నికలు నిర్వహించాలని సర్కారు కృతనిశ్చయంతో ఉందని తెలుస్తోంది. కేంద్రం నిధులను దక్కించుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయం ఉండే అవకాశం కనిపిస్తోంది.

## కేసీఆర్ స్థానంలో ఉండి ఉంటే రాజకీయాలకు గుడ్‌బై చెప్పేవాళ్లం

- మొదటి పేజీ తరువాయి

డిపాజిట్ కూడా దక్కలేదన్నారు. ఆయన స్థానంలో తాను సహా ఎవరు ఉన్నా... రాజకీయాలకు గుడ్‌బై చెప్పేవారమన్నారు. ఎనిమిది నెలలుగా ఇంట్లో ఉండి మధ్యలో రెండుసార్లు నడిచినప్పటికీ అసెంబ్లీకి మాత్రం రాలేదన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీజేపీలో బీఆర్ఎస్ విలీనమవుతున్నట్లుగా తమకు సమాచారం ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. విలీనం వంద శాతం ఉంటుందని అభిప్రాయపడ్డారు. లోకల్ బాడీ ఎన్నికల వరకు బీఆర్ఎస్ ఉంటే ఆ పార్టీ అడ్రస్ లేకుండా చేస్తామన్నారు. బీజేపీది కుర్చీ బచావో ప్రభుత్వమని విమర్శించారు.నీతి అయోగ్ సమావేశాన్ని దక్షిణాది రాష్ట్రాలు బహిష్కరిస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో పెద్ద మొత్తంలో అప్పులు చేసిందని విమర్శించారు. వారు చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తోందన్నారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రస్తుత బడ్జెట్ అత్యుత్తమమైనదన్నారు.

గాడి తప్పిన రాష్ట్ర బడ్జెట్‌ను గాడిలో పెట్టేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేశామన్నారు. దక్షిణ తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ప్రాధాన్యత దక్కిందన్నారు.కేంద్రం సహకరించకపోయినప్పటికీ అత్యుత్తమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగితే కేసీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. వ్యవసాయానికి బడ్జెట్‌లో రూ.72 వేల కోట్లు కేటాయించామని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడైనా ఇలా కేటాయించిందా? అని మంత్రి ప్రశ్నించారు.

## 90 రోజుల్లో మరో 30 వేల కొలువులు..

- మొదటి పేజీ తరువాయి

ఫైర్ మెన్ నాలుగు నెలలు కఠిన శిక్షణ తీసుకొని ప్రజా సేవకు సిద్ధమయ్యారన్నారు. కొందరు యువకులు ఉద్యోగాలు వచ్చిన తర్వాత తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కన్న తల్లిదండ్రులను, తోబుట్టువులను కూడా ఆదుకోవాలని సీఎం సూచించారు. తెలంగాణ ఏర్పాటు కోసం లక్షలాది మంది నిరుద్యోగులు పోరాటాలు చేశారని, వారి ఆకాంక్షలను గత ప్రభుత్వం నెరవేర్చలేదని సీఎం అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత పదేండ్లు కొలువుల కోసం ఎదురు చూశారన్నారు. గత ప్రభుత్వం వారి ఆకాంక్షలను నెరవేర్చలేదని గుర్తు చేశారు. నిన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో విద్య, వైద్యం, సాగునీటి రంగాలకే ఎక్కువ బడ్జెట్ కేటాయించామని సీఎం చెప్పారు.2 లక్షల 91 కోట్ల బడ్జెట్ వాస్తవానికి దగ్గరగా ఉందని చెప్పారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు ఎప్పుడొస్తాయో తెలిసేది కాదని, తాము మొదటి తారీఖునే జీతాలతోపాటు, రిటైర్డ్ ఎంప్లాయిస్ కు పెన్షన్లు కూడా ఇస్తున్నామని పునరుద్ఘాటించారు.

**ఆందోళనలు వద్దు.. మాట్లాడుకుందాం రండి**

కొంత మంది నియామక పరీక్షలు వాయిదా వేయాలని ఆందోళనలు చేస్తున్నారని, ఎలాంటి ఆందోళనలు చేయాల్సిన అవసరం లేదని, సమస్యలు వినేందుకు మంత్రులు సిద్ధంగా ఉన్నారని, మీ అన్నలా తాను కూడా సిద్ధమేనని మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకుందామని సీఎం అన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడి జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పారు. ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి మాట్లాడుతూ..

సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకొని ప్రతి జిల్లాకో ఫైర్ ఆఫీసర్ ను ఏర్పాటు చేశారని చెప్పారు. అగ్ని ప్రమాదాలే కాకుండా ఎలాంటి విపత్తులు వచ్చినా ముందుండాలని సూచించారు.

## ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదు.. పాక్ ఉగ్రదాడుల్ని తిప్పి కొడతాం

- మొదటి పేజీ తరువాయి

లడఖ్ లోని కార్గిల్ మెమోరియల్ వార్ దగ్గర నివాళి అర్పించారు మోదీ.ఈ సందర్భంగా కార్గిల్ వార్ ను ఉద్దేశించి మాట్లాడారు మోదీ. అమరుల త్యాగాలకు గుర్తుగా విజయ్ దివస్ జరుపుకుంటున్నామని చెప్పారు. కార్గిల్ విజయంతో భారత సైనిక శక్తి సామర్థ్యాలు ఏంటో ప్రపంచానికి చాటి చెప్పామన్నారు. కార్గిల్ యుద్ధానికి సాక్షి లద్దాఖ్ అని అన్నారు. సైనికుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. దేశ రక్షణ కోసం వీరమరణం పొందిన సైనికులకు సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. కార్గిల్ యుద్ధంలో ఎంతో మంది సైనికులు వీరమరణం పొందారన్నారు. సైనికులు చేసిన పోరాటం తన మదిలో నిలిచిపోతుందన్న మోదీ.. దేశ ప్రజలు గర్వించ దగ్గర విజయమన్నారు. కార్గిల్ విజయం భారత సైనికుల పరాక్రమణకు నిదర్శనమన్నారు మోదీ. దేశం కోసం సైనికులు చేసిన త్యాగాలు చరిత్రలో నిలిచిపోతాయి. 1999లో కార్గిల్ యుద్ధంలోపాల్గొన్న సైనికులను కలిశాను. కార్గిల్ యుద్ధ సమయంలో ఒక సామాన్యుడిలా సైనికుల మధ్యలో ఉన్నా. జమ్మూ కశ్మీర్ అభివృద్ధికి పెద్ద పీఠ వేస్తున్నాం.లద్దాక్ కుభారీగా నిధులు కేటాయించాం. కశ్మీర్ లో జీ20 సదస్సు నిర్వహించాం. కశ్మీర్ లో మౌళిక సదుపాయాలను మెరుగుపరిచాం. లద్దాక్ ను కలిపే టన్నెల్ పూర్తయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. శ్రీనగర్,లద్దాక్ లో అభివృద్ధి జరుగుతోంది. ఒకప్పుడు లద్దాక్ లో నీళ్లు కూడా దొరికేవి కావు. ఎంతో మంది జవాన్ల త్యాగంతో కార్గిల్ యుద్ధం గెలిచిందన్నారు మోదీ. దేశ రక్షణ రంగంలో ఎన్నో సంస్కరణలు చేపట్టాం. ఆర్మీ జవాన్ల త్యాగ ఫలితంతో కశ్మీర్ లో శాంతి నెలకొంది. కొంత మంది సైన్యాన్ని బలహీనంగా చూపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు మోదీ.

## ఆగస్ట్ 2 లోపు కాళేశ్వరం పంపింగ్ స్టార్ట్ చేయకుంటే...!

**పెన్ పవర్ డెస్క్:**ఆగస్ట్ 2వ తేదీలోపు కాళేశ్వరం పంపింగ్ స్టార్ట్ చేయకపోతే 50 వేల మంది రైతులతో వచ్చి తామే పంపులను స్టార్ట్ చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం వారు బీఆర్ఎస్ ప్రతినిధులు కన్నెపల్లి పంప్ హౌస్‌ను పరిశీలించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ... రాజకీయాల కోసం ప్రజలు, రైతులను ఇబ్బందులు పెట్టవద్దని కోరారు. కేవలం రాజకీయ కక్షతో, కేసీఆర్‌ను బద్నాం చేయాలనే కాళేశ్వరం ప్రాజెక్ట్ పంపులను ఆన్ చేయడం లేదని ఆరోపించారు.కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు కల్పతరువు అన్నారు. కానీ ప్రస్తుతం పంటల సాగుకు నీరు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. గతంలో నీటి సమస్య లేకపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అసత్య ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. కాళేశ్వరం పరిధిలోని జలాశయాల్లో నీరు నింపాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాలలోపు పంప్ హౌస్‌ను ప్రారంభించాలని అల్టిమేటం జారీ చేశారు.అగస్ట్ 2 లోపు జలాశయాల్లో నీటిని నింపాలన్నారు. గోదావరిలో నీరు ఉన్నప్పటికీ ప్రభుత్వానికి నీరిచ్చే మనసు లేదన్నారు. కాళేశ్వరం జలాల కోసం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. పంప్ హౌస్ ఆన్ చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవని ఇంజినీర్లు చెప్పారన్నారు.

## ఈ సీజన్ లోనే రైతులకు పెద్ద వాగు నీళ్లు అందిస్తాం

- మొదటి పేజీ తరువాయి

మరమ్మత్తులు, బండ్ ఫార్మేషన్ అప్రోచ్ కెనాల్ పనులు కోసం అడిగినే వెంటనే స్పందించి సీఎం రేవంత్? రెడ్డి , నీరు పారుదలశాఖ మంత్రి ఉత్తమ్?కుమార్? రెడ్డి నిధులు మంజూరు చేసిన్నట్లుగా ఆయన తెలిపారు. రూ. 3 కోట్ల 50 లక్షలతో ఎస్టిమేట్స్ సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సీజన్ లోనే ప్రాజెక్ట్ తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి ఆయకట్టు కింద రైతుల పంటలకు సాగునీరు ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులకు మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. పెద్దవాగు ప్రాజెక్ట్ మరమ్మత్తు పనులు కోసం వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు

## కేసీఆర్ కక్కుర్తివల్లే కాళేశ్వరానికి లక్షా81వేల కోట్లు ఖర్చు

- మొదటి పేజీ తరువాయి

డ్యామ్ సేఫ్టీ పరిశీలిం చిందన్నారు. %చీూణూ% ఉత్తది కాదు.. మొత్తం ఇండియాలోనే డ్యామ్స్ సేఫ్టీ కోసం పనిచేస్తుంది.. పార్లమెంట్ లో చట్టం ద్వారా ఏర్పాటు చేసింది.. అలాంటి సంస్థ విజిట్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని నిర్ధారించిందన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

మేం అధికారంలోకి రాకముందే కాళేశ్వరం ప్రాజెక్టు కూలింది..పోలీస్ స్టేషన్ లో ఎఫ్ ఐఆర్ కూడా నమోదు అయింది. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని వార్తలు వస్తే కేసీఆర్ ఒక్కమాట కూడా ఎం దు కు మాట్లాడలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

## కవితను వర్చువల్‌గా కోర్టులో హాజరుపరిచిన సీబీఐ అధికారులు

**పెన్ పవర్ డెస్క్:**ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను సీబీఐ అధికారులు శుక్రవారం వర్చువల్‌గా కోర్టులో హాజరుపరిచారు. సీబీఐ కోర్టు జడ్జి సెలవులో ఉండటంతో అధికారులు మరో కోర్టులో హాజరుపరిచారు. ఢిల్లీ మద్యం కేసు విచారణను జడ్జి ఈ నెల 31వ తేదీకి వాయిదా వేశారు.మరోవైపు, ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఐ కేసులో డీఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత వేసిన పిటిషన్‌పై జులై 22న రౌస్ అవెన్యూ కోర్టు విచరణ చేట్టింది. తదుపరి విచారణను ఆగస్ట్ 5కు వాయిదా వేసింది.

## బీఆర్ఎస్ పిటిషన్‌పై వాదనలు వినిపించిన దానం నాగేందర్, కడియం శ్రీహరి!

- మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరారని, వారిపై స్పీకర్ చర్యలు తీసుకునేలా ఆదేశించాలని బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది.

ఈ పిటిషన్‌పై హైకోర్టు నేడు విచారణ జరిపింది. దానం నాగేందర్, కడియం శ్రీహరి తరఫున న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. స్పీకర్ విషయంలో కోర్టులు జోక్యం చేసుకోరాదని న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఈ మేరకు పలు కోర్టుల తీర్పులను వారు చదివి వినిపించారు. అనంతరం తదుపరి విచారణను వాయదా వేసింది.

## ఎవరు తీసిన గోతిలో వాళ్లే పడ్డరు

- మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ నాయకులారా! నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై తర్కవంతమైన ప్రశ్నలు అడగలేక కాంగ్రెస్ లేవనెత్తిన అంశమే తమను పాములా కాటేసింది! మీ లాజిక్ ప్రకారం కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ పేరు లేకపోతే మనకు ఏమీ రానట్లైతే.. మరి రాష్ట్ర బడ్జెట్ లో ప్రస్తావించని జిల్లాలకూ ఏ నిధులు కేటాయించనట్టేనా రేవంత్ రెడ్డి?? అసత్య ప్రచారాలపై అధికారం చేపట్టిన మీకు.. చైతన్యవంతమైన తెలంగాణ సమాజం చేతిలో శిక్ష తప్పదు' అంటూ ట్వీట్?చేసింది.

## కేసీఆర్ తలాతోక లేకుండా మాట్లాడుతున్నారు

- మొదటి పేజీ తరువాయి

భారీ వడ్డీలు కడుతున్నామన్నారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో ఎప్పుడూ వాస్తవిక బడ్జెట్‌ను పెట్టలేదన్నారు. తాము మోసం చేయకుండా, వాస్తవాలకు దగ్గరగా ఎంత వస్తే అంతే ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతుబంధు ఎత్తేసినట్లుగా కేసీఆర్ మాట్లాడటం విడ్డూరమన్నారు. గతంలో ఇచ్చిన దానికి ఎక్కడా తగ్గించి ఇవ్వలేదన్నారు. గతంలో బీఆర్ఎస్ అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి అనుకున్నారని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో వ్యవసాయానికి 25 శాతం కేటాయింపులు జరిపామన్నారు.

# 'పారిస్ ఒలింపిక్స్' ఆరంభానికి ముందు ఫ్రాన్స్‌లో దుశ్చర్య.. నిలిచిపోయిన ఫ్రెంచ్ హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్

**హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్‌పై భారీ కుట్ర దాడి**

**అనేక చోట్ల రైల్వే సౌకర్యాల దహనం**

**ఏకకాలంలో విధ్వంస దాడులు**

**పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవానికి కొన్ని గంటల ముందు దుశ్చర్య**



'**హైదరాబాద్ పెన్ పవర్:** పారిస్ ఒలింపిక్స్' ఆరంభానికి కొన్ని గంటల ముందు ఆతిథ్య దేశం ఫ్రాన్స్‌లో టీజీవీ హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ పూర్తిగా స్తంభించింది. రైల్వే ట్రాకులపై విధ్వంసకారులు కుట్రపూరిత దాడులకు పాల్పడ్డారు. అనేక చోట్ల ట్రాకులు, రైల్వే సౌకర్యాలను దహనం చేశారు. అత్యంత హానికరమైన ఈ చర్యలతో ఇంటర్‌సిటీ హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌గా ఉన్న టీజీవీ సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం కలిగింది. ఏకంగా 8 లక్షల మంది ప్రయాణికులు ప్రభావితమయ్యారు. పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవానికి కొన్ని గంటల ముందు ఈ పరిణామం జరిగిందని టీజీవీ నెట్‌వర్క్ నిర్వహణ సంస్థ ఎస్ఎన్‌సీఎఫ్ శుక్రవారం ప్రకటించింది. సమన్వయంతో ఈ విధ్వంస చర్యలకు పాల్పడ్డారని, దీనిపై దర్యాప్తు చేయబోతున్నట్టు ఎస్ఎన్‌సీఎఫ్‌సీ ప్రతినిధి ఒకరు ప్రకటించారు.
టీజీవీ నెట్‌వర్క్‌ను స్తంభింపజేయడానికి జరిగిన భారీ దాడి ఇది అని, అనేక రూట్లలో రైళ్లను రద్దు చేయాల్సి ఉంటుందని ఎస్ఎన్‌సీఎఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జీన్-పియర్ ఫారండో వివరించారు. రాత్రి ఏకకాలంలో ఈ హానికరమైన దాడులకు పాల్పడ్డారని ఆయన వెల్లడించారు. ఈ దాడుల కారణంగా ఉత్తర, తూర్పు మార్గాల్లో రైలు నెట్‌వర్క్ ప్రభావితం అయిందని చెప్పారు. రైలు నెట్‌వర్క్ సౌకర్యాలను దెబ్బతీసేందుకు దాడులకు పాల్పడ్డారని, ప్రభావిత మార్గాలలో రైళ్ల ప్రయాణాలకు భారీ అంతరాయం కలిగిందని జీన్-పియర్ వివరించారు. మరమ్మతులు మొదలయ్యాయని, అయితే వారాంతం వరకు పనులు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించారు. 8 లక్షల మంది ప్రయాణికులు ప్రభావితమయ్యారని, పలు రైళ్లను వేర్వేరు ట్రాక్‌లకు మళ్లించినట్టు తెలిపారు. పెద్ద సంఖ్యలో రైళ్లను రద్దు చేయాల్సి వచ్చిందని వివరించారు. సోమవారం నుంచి తిరిగి సర్వీసులు ప్రారంభం కావొచ్చని తెలుస్తోంది.
అనూహ్యమైన ఈ పరిణామంపై ఫ్రాన్స్ రవాణా శాఖ మంత్రి ప్యాట్రిస్ స్పందించారు. టీజీవీ రైలు నెట్‌వర్క్‌పై భారీ దాడి జరిగిందని వ్యాఖ్యానించారు. ఇది తీవ్రమైన నేరపూరిత చర్య అని, పారిస్ ఒలింపిక్స్ ఆరంభోత్సవానికి కొన్ని గంటల ముందు ఈ పరిణామం జరిగిందన్నారు. కాగా ఎవరు ఈ దాడులకు పాల్పడ్డారనే విషయం తెలియాల్సి ఉంది.

# కమలా హ్యారీస్‌కు సంపూర్ణ మద్దతు: బరాక్ ఒబామా

**భార్య మిచెల్లీ ఒబామాతో కలిసి ఫోన్ చేసి మద్దతు ప్రకటించిన మాజీ అధ్యక్షుడు**

**సంక్లిష్ట సమయంలో ఉండాల్సిన గొప్ప లక్షణాలు మీలో ఉన్నాయంటూ ప్రశంస**

**హర్షం వ్యక్తం చేసిన డెమొక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థి కమలా హ్యారీస్**



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్ష ఎన్నికలు 2024లో డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష నామినీగా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హ్యారీస్ నిలబడడం మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు ఇష్టం లేదంటూ కొన్ని రోజులుగా వెలువడుతున్న ఊహాగానాలకు తెరపడింది. కమలా హ్యారీస్‌కు ఒబామా సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం కీలక పరిణామం జరిగింది. ఒబామా, ఆయన భార్య మిచెల్లీ ఒబామా ఇద్దరూ కలిసి కమలా హ్యారీస్‌కు ఫోన్ చేసి మద్దతు ప్రకటించారు. సంక్లిష్టమైన ఈ సమయంలో ఉండాల్సిన దూర దృష్టి, సామర్థ్యం, చక్కటి స్వభావం ఉన్నాయని ఒబామా కొనియాడారు. చరిత్ర సృష్టించబోతున్నామని ఆమెను ఉత్సాహపరిచారు. ఈ మేరకు ప్రైవేట్ ఫోన్ కాల్‌కు సంబంధించిన సంభాషణ వీడియోను అధికారికంగా షేర్ చేశారు. " నేను, మిచెల్లీ మీకు ఫోన్ చేసింది కేవలం మీకు మద్దతు తెలపడానికే కాదు. మిమ్మల్ని ఓవల్ ఆఫీస్‌కు తీసుకెళ్లేందుకు మేము చేయగలిగినదంతా చేస్తాం. ఈ విషయం మీకు తెలియజేయడానికి గర్వపడుతున్నాను" అని ఒబామా పేర్కొన్నారు. "మీ పట్ల ఆప్యాయత లేకుంటే ఈ ఫోన్ కాల్ చేసేవాళ్లం కాదు. మిమ్మల్ని చూసి మేము గర్వపడుతున్నాం" అని మిచెల్ ఒబామా అన్నారు. "మిచెల్, బరాక్ మీరు నాకు ఫోన్ చేయడం చాలా గొప్పం విషయం" అని కమలా హ్యారీస్ అన్నారు. "మీ ఇద్దరితో కలిసి పనిచేయడానికి నేను ఎదురుచూస్తున్నాను. నా భర్త డగ్, నేను మీరు మాట్లాడిన మాటలను, ఇన్నేళ్లు మాతో కొనసాగించిన స్నేహం మాటల్లో చెప్పడం కంటే చాలా ఎక్కువ. మీ ఇద్దరికీ ధన్యవాదాలు" అని కమలా హ్యారీస్ పేర్కొన్నారు. ఫోన్ కాల్ అనంతరం ఎక్స్ వేదికగా కూడా ఈ మేరకు బరాక్ ఒబామా ప్రకటన చేశారు.

# ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై కోదండరాం తీవ్ర ఆగ్రహం

**దివ్యాంగులపై స్మితా సబర్వాల్ వ్యాఖ్యలను ఖండించిన కోదండరాం**

**కొన్ని ఉద్యోగాలకు పనికిరారన్న స్మిత వ్యాఖ్యలు రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్య**

**వైకల్యం పేరుతో వారి హక్కులను హరించడం దారుణమన్న కోదండరాం**



**హైదరాబాద్ పెన్ పవర్:** దివ్యాంగులపై ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జన సమితి అధినేత కోదండరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలను కోదండరాం ఖండించారు. దివ్యాంగులు కొన్ని ఉద్యోగాలకు పనికి రారన్న ఆమె వ్యాఖ్యలు రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధమన్నారు. వైకల్యం పేరుతో వారి హక్కులను హరించడం దారుణమన్నారు. చట్టాలను అమలు చేయాల్సిన ఐఏఎస్ అధికారిణి వైకల్యాన్ని కించపరచడం సరికాదన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు పశ్చాత్తాపం ప్రకటించకపోగా... ఇంకా వాటిని సమర్థించుకోవడం దారుణమని స్మితా సబర్వాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజం ఇలాంటి వ్యాఖ్యలను ఖండించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి మాటలు రాకుండా ప్రభుత్వం చూడాలన్నారు.

# మదనపల్లె ఘటనలో మాధవరెడ్డి అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు: సిసోడియా

**మదనపల్లె నుంచి విజయవాడ బయల్దేరిన ఆర్పీ సిసోడియా**

**రాయచోటిలో అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ సందర్శన**

**జిల్లా కలెక్టర్ శ్రీధర్, జేసీ, ఇతర రెవెన్యూ అధికారులతో సిసోడియా సమావేశం**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మదనపల్లె నుంచి విజయవాడ వెళుతూ రాయచోటిలోని అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ను సందర్శించారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులతో సిసోడియా సమావేశమయ్యారు. రెవెన్యూ శాఖ రికార్డులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ, మదనపల్లెలో ఫైళ్ల దగ్ధం ఘటనపై విచారణ కొనసాగుతోందని చెప్పారు. మాధవరెడ్డి అనే వ్యక్తి ఇప్పటికే పరారీలో ఉన్నాడని, మదనపల్లె ఘటనలో నాలుగు బృందాలు విచారణలో పాలుపంచుకుంటున్నాయని వివరించారు. ఈ ఘటనలో ఏడుగురిని విచారిస్తున్నామని సిసోడియా వెల్లడించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి నివేదిక వస్తే అనేక వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ఘటన జరిగిన కార్యాలయంలో పనిచేసే కొందరు సిబ్బందిపై అనుమానం ఉందని తెలిపారు. త్వరలో శాఖాపరమైన చర్యలు చేపడతామని, కొందరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడే అవకాశాలున్నాయని, మరికొందరిని అరెస్ట్ చేసే అవకాశముందని స్పష్టం చేశారు. మంటల్లో కాలిపోయిన రికార్డుల రికవరీకి అవకాశముందని సిసోడియా పేర్కొన్నారు. కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో లావాదేవీల రికార్డులు పరిశీలించామని చెప్పారు. 20 ఏళ్ల తర్వాత డి-పట్టాలు ఫ్రీహోల్డ్ లోకి వెళ్లిపోతాయన్న భావనతోనే ఈ ఘటనకు పాల్పడి ఉంటారన్న అనుమానాలు కలుగుతున్నాయని వివరించారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 2.16 లక్షల ఎకరాల భూమి ఫ్రీహోల్డ్ అయిందని, అందులో 4,400 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని అన్నారు. ఫ్రీహోల్డ్ పై ఆయా జిల్లాల కలెక్టర్లు విచారణ చేపట్టారని సిసోడియా తెలిపారు.

# మంత్రి నారా లోకేశ్ ను కలిసిన వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానమ్

**ఏపీ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం**

**వైసీపీ నేతలు అసెంబ్లీ సమావేశాలు బహిష్కరించినా మండలికి వస్తున్న జకియా ఖానమ్**

**ఇప్పటికే మంత్రి ఫరూఖ్ ను కలిసిన వైనం**

**నేడు కుటుంబ సభ్యులతో కలిసి నారా లోకేశ్ తో భేటీ**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ రాజకీయాల్లో నేడు ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానమ్ మంత్రి నారా లోకేశ్ ను కలిశారు. జకియా ఖానమ్ వైసీపీని వీడి టీడీపీలో చేరతారని కొన్నిరోజులుగా ప్రచారం జరుగుతోంది. వైసీపీ నేతలు అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించినా, ఆమె మాత్రం శాసనమండలికి హాజరవుతున్నారు. ఆమె ఇటీవలే మంత్రి ఫరూఖ్ ను కలవడంతో ఊహాగానాలకు బలం చేకూరింది. తాజాగా, జకియా ఖానమ్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి నారా లోకేశ్ తో భేటీ అయ్యారు. లోకేశ్ తో పలు అంశాలపై ఆమె చర్చించారు.

# బెంగళూరు ట్రాఫిక్ కష్టాలు... డ్రైవింగ్ చేస్తూ వెళ్లడం కంటే నడుస్తూ త్వరగా వెళ్లొచ్చట!

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలోని జన సమ్మర్ద నగరాల్లో బెంగళూరు ఒకటి. పైగా భారతదేశ ఐటీ రాజధానిగా బెంగళూరు ఖ్యాతి గడించింది. ఇక్కడ ట్రాఫిక్ కూడా ఎక్కువగానే ఉంటుంది. తాజాగా బెంగళూరు ట్రాఫిక్ గురించి గూగుల్ మ్యాప్స్ వెల్లడించిన అంశం ఆసక్తి కలిగిస్తోంది. బెంగళూరు రోడ్లపై 6 కిలోమీటర్ల దూరం డ్రైవ్ చేసుకుంటూ వెళ్లడం కంటే, నడుస్తూ వెళ్లడం ద్వారా త్వరగా చేరుకోవచ్చుట. బెంగళూరులో కేఆర్ పురం రైల్వే స్టేషన్ నుంచి గరుడాచార్ పాళ్యలోని బ్రిగేడ్ మెట్రోపాలిస్ వరకు ఏదైనా వాహనంలో వెళ్లడానికి 44 నిమిషాల సమయం పడితే, అదే దూరం నడిచి వెళ్లడానికి 42 నిమిషాలు పడుతుందని గూగుల్ మ్యాప్స్ చెబుతోంది. బెంగళూరు నగరం ఐటీ, ఐటీ అనుబంధ కంపెనీలతో ఆర్థికంగా ఎంతో ఎదిగినప్పటికీ, మౌలిక వసతుల పరంగా ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉందన్న విషయాన్ని ఈ అంశం ఎత్తిచూపుతోంది. బెంగళూరు నగర జనాభా వేగంగా పెరగడంతో పాటు, పక్కా ప్రణాళికబద్ధంగా నగర నిర్మాణం లేకపోవడం, పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకుని చూస్తే పరిమిత స్థాయిలోనే రవాణా సౌకర్యాలు ఉండడం వంటి అంశాలు నగర ట్రాఫిక్ ను ప్రభావితం చేస్తున్నాయి.

# రాహుల్ గాంధీకి కొత్త బంగ్లాను ఆఫర్ చేసిన లోక్ సభ హౌస్ కమిటీ

**సునేహ్రి బాగ్ రోడ్డులో బంగ్లా నెంబర్ 5ని ఆఫర్ చేసిన కమిటీ!**

**ఈ ఇంటికి సంబంధించి రాహుల్ గాంధీ నుంచి సమాధానం రావాల్సి ఉంది**

**రాహుల్ గాంధీ టైప్ 8 బంగ్లాకు అర్హులు**



**హైదరాబాద్ పెన్ పవర్:** లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కేంద్ర ప్రభుత్వం కొత్త నివాసాన్ని కేటాయించనుంది. సునేహ్రి బాగ్ రోడ్డులోని బంగ్లా నెంబర్ 5ను హౌస్ కమిటీ ఆయనకు ఆఫర్ చేసినట్లుగా సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రియాంక గాంధీ ఈ భవనాన్ని చూసేందుకు వచ్చారు. దీంతో ఆయనకు ఈ భవనం కేటాయించనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ ఇంటికి సంబంధించి రాహుల్ గాంధీ నుంచి సమాధానం రావాల్సి ఉందని తెలుస్తోంది. లోక్ సభలో ఆయన ప్రతిపక్ష నేత కాబట్టి కేబినెట్ ర్యాంక్ కలిగి ఉన్నారు. ఆయన టైప్ 8 బంగ్లాకు అర్హులు. టైప్ 8 బంగ్లాను కేబినెట్ మంత్రులు, సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు, సహాయమంత్రులు, కేంద్ర ప్రభుత్వంలోని కీలక కార్యదర్శులకు కేటాయిస్తారు.

# సీనియర్ నటి పావలా శ్యామలకు ఆర్థికసాయం అందించిన మెగా హీరో సాయి దుర్గా తేజ్




**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ సీనియర్ నటి పావలా శ్యామల గత కొన్నాళ్లుగా అనారోగ్యం, వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. చాలావరకు ఆమె దాతల సాయంపైనే బతుకు వెళ్లదీస్తున్నారు. గతంలో మెగాస్టార్ చిరంజీవి కూడా ఆమెకు సాయం అందించారు. తాజాగా, మెగా మేనల్లుడు సాయి దుర్గా తేజ్ కూడా పావలా శ్యామలకు ఆర్థిక సాయం చేశారు. సాయి దుర్గా తేజ్ సినీ జర్నలిస్టులకు రూ.5 లక్షల విరాళం ఇవ్వగా, అందులో ఒక లక్ష రూపాయలు పావలా శ్యామలకు కేటాయించారు. తనకు సాయి దుర్గా తేజ్ ఆర్థిక సాయం చేయడం పట్ల పావలా శ్యామల కృతజ్ఞతలు తెలియజేశారు. సాయి తేజ్ తనకు సాయం చేస్తానని చాలాకాలం కిందటే మాటిచ్చాడని, కానీ ఆ తర్వాత ఆయనకు యాక్సిడెంట్ కావడంతో ఆ విషయం మర్చిపోయి ఉంటాడని అనుకున్నామని, కానీ ఇప్పటికీ ఆ విషయం గుర్తుపెట్టుకుని సాయం అందించడం ఆయన మంచితనానికి నిదర్శనం అని పావలా శ్యామల కొనియాడారు. ఈ సందర్భంగా సాయి తేజ్ ఆమెతో వీడియో కాల్ మాట్లాడారు. ఓ దశలో తాము బతకలేక చనిపోదాం అనుకున్నామని, కానీ మెగాస్టార్ చిరంజీవి వంటి వారు ఆదుకున్నారని శ్యామల వెల్లడించారు. మా అమ్మాయికి కూడా కాలు విరిగింది... దాంతో మాకు బతకాలన్న ఆశ పోయింది... చచ్చిపోదాం అనుకున్నాం అని ఆమె వాపోయారు. ఊరుకోండమ్మా... మీరు అలా అనకూడదు... మేమంతా ఉన్నాం కదా అని సాయి తేజ్ ఓదార్పు వచనాలు పలికారు. సాయితేజ్ గారూ మీకు యాక్సిడెంట్ అయినప్పుడు... మీరు బతకాలని ఆ దేవుడ్ని ప్రార్థించాం... దేవుడి దయవల్ల మీరు క్షేమంగా తిరిగి వచ్చారు అని పావలా శ్యామల సాయి తేజ్ తో అన్నారు. అందుకు సాయి తేజ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# బడ్జెట్ ప్రకటన తర్వాత దిగివస్తున్న పసిడి ధరలు.. 3 రోజుల్లో గణనీయ తగ్గుదల

**మూడు రోజుల్లో ఏకంగా రూ.5000 తగ్గిన 10 గ్రాముల బంగారం ధర**

**వెండి ధరలోనూ భారీ తగ్గుదల**

**బంగారం దిగుమతులపై కస్టమ్స్ సుంకం తగ్గింపుతో తగ్గుతున్న ధరలు**



**హైదరాబాద్ పెన్ పవర్:** కస్టమ్స్ సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర బడ్జెట్ 2024-25లో కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో బంగారం ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. బడ్జెట్ ప్రకటన వెలువడిన మూడు రోజుల్లో 10 గ్రాముల పసిడి ధర ఏకంగా 7 శాతం లేదా రూ.5000 మేర దిగివచ్చింది. దేశ రాజధాని ఢిల్లీలో రూ.75,000 ఎగువున ఉన్న 10 గ్రాముల బంగారం ధర బడ్జెట్ ప్రకటన తర్వాత రూ.70,650 స్థాయికి తగ్గింది. ఇక కిలో వెండి ధర కూడా రూ.84,000 స్థాయికి పడిపోయింది. ధరలు తగ్గుదలను కొనుగోలుదారులు కూడా స్వాగతిస్తున్నారు. ధరలో గణనీయమైన తగ్గుదల కనిపిస్తుండడంతో ఆభరణాల కొనుగోలు డిమాండ్ కూడా పెరిగింది. తిరిగి బంగారాన్ని కొనేందుకు కస్టమర్లు మొగ్గుచూపుతున్నారు. ఆభరణాలు కొనుగోలు చేసే కస్టమర్ల సంఖ్య పెరుగుతోందని వ్యాపారులు చెబుతున్నారు. పండగల సీజన్‌కు ముందు ధరల తగ్గుదల తమకు కలిసి రావడం ఖాయమని, ఆభరణాల విక్రయాలకు మరింత ఊతం ఇస్తుందని పీసీ జ్యువెలర్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్ గార్గ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కస్టమ్స్ సుంకం తగ్గింపుతో బంగారం దిగుమతులు చౌకగా మారాయి. ఈ నిర్ణయం బంగారం అక్రమ రవాణాకు కూడా అడ్డుకట్ట వేయగలదనే అంచనాలున్నాయి. వ్యవస్థీకృత ఆభరణాల రంగానికి లబ్ది చేకూరుతుందని, బంగారంపై పెట్టుబడులు కూడా పెరుగుతాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. బంగారాన్ని ఒక ఆస్తిగా ప్రోత్సహించేలా ప్రభుత్వ నిర్ణయం ఉపయోగపడుతుందని చెబుతున్నారు. బంగారం దిగుమతులపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గించడంతో ధరలు గణనీయంగా తగ్గాయని ఎల్‌కేజీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్, రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది పేర్కొన్నారు. బంగారం అక్రమ రవాణాను అరికట్టడానికి, సంఘటిత రంగానికి మేలు ప్రయోజనం చేయాలనే దీర్ఘకాలిక డిమాండ్లను ప్రభుత్వ నిర్ణయం పరిష్కరిస్తుందని విశ్లేషించారు.

# పేసర్ మహ్మద్ షమీ డైట్ సీక్రెట్ బయటపెట్టిన అతడి స్నేహితుడు

**రోజుకు ఒక కేజీ మటన్ తినకుండా షమీ ఉండలేడన్న స్నేహితుడు ఉమేష్ కుమార్**

**కేవలం ఒక రోజు మాత్రమే ఉండగలడని వెల్లడి**

**మటన్ తినకుంటే షమీ బౌలింగ్ వేగంగా గంటకు 15 కిమీ మేర తగ్గుతుందని వ్యాఖ్య**



**హైదరాబాద్ పెన్ పవర్:** మడమ గాయానికి శస్త్రచికిత్స అనంతరం కోలుకొని.. తిరిగి భారత్ జట్టులో చోటు సంపాదించడమే లక్ష్యంగా సన్నాహాలు మొదలు పెట్టిన స్టార్ పేసర్ మహ్మద్ షమీ అనుసరించే ఆహారపు అలవాట్లపై (డైట్) అతడి స్నేహితుడు ఉమేష్ కుమార్ స్పందించాడు. మటన్ అంటే షమీకి అమితమైన ఇష్టమని, షమీ దేన్నైనా భరించగలడు, కానీ మటన్ లేకుండా ఉండలేడని ఉమేష్ కుమార్ వెల్లడించాడు. మటన్ లేకుండా ఒక్క రోజు మాత్రమే ఉండగలడని, రెండవ రోజు కూడా మటన్ లేకుంటే ఇబ్బందిగా భావిస్తాడని, ఇక మూడవ రోజు కూడా మటన్ తినకపోతే పిచ్చివాడిలా చేస్తాడని అన్నాడు. షమీ రోజుకు 1 కేజీ మటన్ తింటాడని, ప్రతిరోజూ మటన్ తినకుంటే అతడి బౌలింగ్ వేగం గంటకు 15 కిమీ మేర తగ్గుతుందని ఉమేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుభంకర్ మిశ్రా యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. కాగా మహ్మద్ షమీ గాయం కారణంగా ప్రస్తుతం క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. చివరిసారిగా 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో ఆడాడు. ఆస్ట్రేలియాతో జరిగిన ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత్ ఓడిపోయిన విషయం తెలిసిందే.

అప్పటికే చీలమండ గాయంతో బాధపడుతున్న షమీ వరల్డ్ కప్ ముగిసిన వెంటనే లండన్ వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. దీంతో అతడు ఆటకు దూరంగా ఉన్నాడు. వన్డే వరల్డ్ కప్‌లో మొత్తం 24 వికెట్లతో టాప్ వికెట్ టేకర్‌గా నిలిచిన షమీ.. ఆ తర్వాత ఐపీఎల్, టీ20 ప్రపంచ కప్ లాంటి మెగా టోర్నీలకు దూరమైన విషయం తెలిసిందే. కాగా షమీ ఇటీవలే ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. నెట్స్‌లో బౌలింగ్ చేస్తున్నాడు. సెప్టెంబరు 19 నుంచి బంగ్లాదేశ్‌తో జరగనున్న టెస్టు సిరీస్ సమయానికి షమీ పూర్తి ఫిట్‌నెస్ సాధించే అవకాశం ఉందని భారత చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ఇటీవల ఆశాభావం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

# ‘భారత జట్టు పాక్‌లో పర్యటించాలి.. కోహ్లీ ఆడాలి’ అంటూ ఎందుకో చెప్పిన పాక్ మాజీ కెప్టెన్ యూనిస్‌ఖాన్

**కోహ్లీ కెరియర్‌లో పాకిస్థాన్ టూర్ లేకుండా పోయిందన్న యూనిస్‌ఖాన్**

**అతడొచ్చి పాక్‌లో ఆడితే ఆ ముచ్చట కూడా తీరిపోతుందని వ్యాఖ్య**

**కోహ్లీ పాకిస్థాన్‌లో ఆడాలనుకోవడం తమ కోరిక కూడా అని వెల్లడించిన మాజీ కెప్టెన్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించాలని.. కోహ్లీ పాక్‌లో ఆడాలని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ యూనిస్‌ఖాన్ పేర్కొన్నాడు. కోహ్లీ కెరియర్‌లో పాక్ పర్యటన లోటుగా మిగిలిపోయిందని, అతడొచ్చి పాకిస్థాన్‌లో ఆడితే చూడాలని ఉందని, అది తమ కోరిక అని చెప్పుకొచ్చాడు. “2025 చాంపియన్స్ ట్రోఫీకి విరాట్ కోహ్లీ రావాలి. అది మా కోరిక కూడా. అతడొచ్చి పాకిస్థాన్‌లో ఆడాలి. కోహ్లీ కెరియర్‌లో పాకిస్థాన్ టూర్ లేకుండా పోయింది. కాబట్టి ఈ ట్రోఫీ కోసం అతడొచ్చి ఇక్కడ ఆడాలి” అని యూనిస్‌ఖాన్ పేర్కొన్నాడు.

కోహ్లీ 2008లో అంతర్జాతీయ కెరియర్ ప్రారంభించగా, అంతకు రెండేళ్ల ముందు అంటే 2006లో భారత జట్టు చివరిసారి పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్ ఆడింది. ఆ తర్వాత మరెప్పుడూ టీమిండియా పాక్‌లో పర్యటించలేదు. ఇక, వచ్చే పాకిస్థాన్ ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యమిస్తోంది. భారత జట్టు ఈ టోర్నీలో పాల్గొనే అవకాశం కనుచూపు మేరలో కనిపించడం లేదు. దాయాది దేశం వెళ్లేందుకు భారత జట్టుకు ప్రభుత్వం అనుమతిచ్చే అవకాశాలు దాదాపు లేవు. ఈ నేపథ్యంలో ఆసియా కప్‌లో అనుసరించిన హైబ్రిడ్ విధానాన్నే చాంపియన్స్ ట్రోఫీలోనూ అనుసరించాలని బీసీసీఐ ప్రతిపాదిస్తున్న సంగతి విదితమే!

# గంభీర్ గోల గోల చేసే రకం కాదు: రవిశాస్త్రి

**టీమిండియా కొత్త కోచ్ గా గంభీర్ నియామకం**

**శ్రీలంక పర్యటనతో కోచ్ గా ప్రస్థానం ప్రారంభిస్తున్న గంభీర్**

**గంభీర్ ఫ్రెష్ ఐడియాలతో జట్టును నడిపిస్తాడని ఆశిస్తున్నట్టు శాస్త్రి వెల్లడి**

**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ గురించి అందరికీ తెలిసిందేనని, గోల గోల చేసే రకం కాదని మాజీ కోచ్ రవిశాస్త్రి అన్నారు. నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుపోయే రకం అని వెల్లడించారు. గంభీర్ సరైన వయసులో టీమిండియా కోచ్ గా వచ్చాడని అభిప్రాయపడ్డారు. ఫ్రెష్ ఐడియాలతో టీమిండియాను నడిపిస్తాడని, గంభీర్ సామర్థ్యం ఏంటో ఇటీవల ఐపీఎల్ సీజన్ లో చూశామని రవిశాస్త్రి పేర్కొన్నారు. పరిణతి చెందిన ఆటగాళ్లతో కూడిన టీమిండియాకు కోచ్ గా వ్యవహరిస్తుండడం కలిసొచ్చే అంశమని అన్నారు. ఆటగాళ్లందరూ తమ తమ స్థానాల్లో కుదురుకున్నారని, అలాంటి జట్టును తన తాజా ఆలోచనలతో గంభీర్ విజయవంతంగా నడిపిస్తాడని ఆశిస్తున్నానని తెలిపారు. రేపటి నుంచి టీమిండియా-శ్రీలంక మధ్య టీ20 సిరీస్, ఆగస్టు 2 నుంచి వన్డే సిరీస్ జరగనున్న నేపథ్యంలో, రవిశాస్త్రి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి ఈ సిరీస్ లో టీమిండియానే ఫేవరెట్ గా బరిలో దిగుతోంది.



## మాళవిక మోహనన్ యొక్క నక్షత్ర లుక్స్



# పాపం రష్మిక.. ఏదో అనుకుంటే, ఇంకేదో జరిగింది..!



నేషనల్ క్రష్ రష్మిక మందనా దక్షిణాదిన స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఛలో మూవీతో తెలుగులోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ ఇక్కడ స్టార్ హీరోయిన్ హోదా దక్కించుకుంది. ఇప్పుడు బాలీవుడ్ లోనూ స్టార్ హీరోయిన్ గా ఎదిగేందుకు తన ప్రయత్నాలు తాను చేస్తోంది. వరసగా గుడ్ బై, మిషన్ మజ్నూ వంటి సినిమాల్లో నటించింది. ఆ సినిమాలపై ఎక్కువ ఆశలు పెట్టుకుంది కానీ, పెద్దగా ఫలితం దక్కలేదు. అయితే, ఎలాగైనా బాలీవుడ్ లో మంచి స్థానం దక్కించుకోవాలని తాపత్రయపడుతోంది.

దీనిలో భాగంగానే, ఆమె బాలీవుడ్ సినిమాల కోసం టాలీవుడ్ లో వస్తున్న ఆఫర్లను పక్కన పెడుతోంది. ఇటీవల నితిన్, వెంకీ కుడుముల కాంబినేషన్ లో ఓ సినిమా ఒకే అయిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో మొదటి నుంచి రష్మికనే హీరోయిన్ గా తీసుకోవాలని అనుకున్నారు. రష్మిక కూడా ముందు ఒకే చెప్పింది. కానీ, తర్వాత ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకుంది. బాలీవుడ్ లో షాహిద్ కపూర్ తో కలిసి నటించే అవకాశం రావడంతో, ఆ సినిమా కోసం ఈ సినిమా ను వదులుకుంది. ఈ రెండు సినిమాలకు డేట్స్ కుదరకపోవడంతో ఆమె ఈ నితిన్ సినిమాను వదిలేసింది. షాహిద్ కపూర్ సినిమా కాబట్టి, బాలీవుడ్ లో మంచి క్రేజ్ వస్తుందని అనుకుంది. కానీ, ఆమె ప్లాన్ రివర్స్ అయ్యింది. బడ్జెట్ సమస్యల కారణంగా షాహిద్ కపూర్ సినిమా మొదలుకాకముందే ఆగిపోయింది. ఈ సినిమా ఎప్పటికి మొదలౌతుందో ఎవరికీ తెలీదు. పాపం, ఏదో అనుకుంటే, ఇంకేదో అయ్యింది. ఈ లెక్కన ప్రస్తుతం రష్మిక చేతిలో పుష్ప2 తో పాటు, యానిమల్ సినిమాలు మాత్రమే ఉన్నాయి. ఈ సినిమాల్లో యానిమల్ షూటింగ్ ఎప్పుడో పూర్తైపోయింది. పుష్ప2 షూటింగ్ లో ఇటీవలే రష్మిక అడుగుపెట్టింది. ఈ రెండు సినిమాలు అయిపోతే, రష్మిక చేతిలో ఎలాంటి ప్రాజెక్ట్ లేనట్లే. అయితే, రీసెంట్ ఆమెకు షారూక్ తో నటించే ఓ ఆఫర్ వచ్చింది అంటూ వార్తలు వచ్చాయి. అయితే, ఈ విషయంలో ఇప్పటి వరకు అధికారిక ప్రకటన అయితే రాలేదు, ఒకవేళ నిజంగా షారూక్ తో ఆఫర్ వస్తే, రష్మిక మళ్లీ ఫామ్ లో కి వచ్చేస్తుంది.



## ఆకాంక్ష శర్మ యొక్క అద్భుతమైన భంగిమలు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com